ఏడాదిగా ఎదురు చూపులు

- కొత్త వీసీ దృష్టి సారించేనా!
- 500 మంది ఆవేదన
- అమలుకు నోచుకోని పీఎఫ్, ఈఎస్ఐ రునుము
- నిలచిన వైద్య సేవలు



బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో పనిచేస్తున్న దాదాపు 500 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కష్టాలు ఎడాదిగా కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ మురళీకృష్ణ ఆరు నెలలు పని చేసినా వారి సమస్యలపై దృష్టి సారించలేదు. తాజాగా నియమితులైన పూర్తిస్థాయి వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ సైతం అదే తోవలో నడుస్తున్నారు. వర్సిటీతో పాటు కళాశాలలో ఉన్నత స్థాయి అధికారులు డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, ప్రిన్సిపాల్స్, రిజిస్ట్రార్, రెక్టార్‌తో పాటు వీసీ చాంబర్‌లో నలుగురి నుంచి ఐదుగురు సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకూ వీరితోనే కలిసి తమ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. అటువంటిది వీరి చిన్న సమస్యపై ఏమాత్రం దృష్టి పెట్టకపోవడంతో చిరుద్యోగులు తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఉద్యోగులకు ఏజెన్సీ ద్వారా హోదాను బట్టి 12 వేల నుంచి 18 వేల వరకూ వేతనం చెల్లిస్తుంది. వారి వేతనం నుంచి చెల్లించాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్‌లను ఆయా సంస్థలకు చెల్లించక పోవడంతో అటు పీఎఫ్ డ్రా చేసుకోవడానికి అవకాశం లేకపోగా వైద్యసేవల నిమిత్తం ఈఎస్ఐ కార్డు సైతం వినియోగంలోకి లేకుండా పోయింది. దీంతో ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే హెల్త్ కార్డులు పనిచేయకపోవడంతో లక్షలు చెల్లించి వైద్యం పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ విషయంపై యూనియన్ల తరపున ఉద్యోగులు ప్రతిపాదించినా ఏ మాత్రం చలనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరణించిన ఉద్యోగి కుటుంబ సభ్యులు పీఎఫ్ డ్రా చేసుకోవడానికి అవకాశం లేకుండా పోతోంది. ఇలా పలు సమస్యలతో సతమతమౌతున్నారు. ఈ విషయంపై జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణను వివరణ కోరగా కొత్తగా ఏజెన్సీను ఎంపికచేశామని ఆ ఏజెన్సీ ద్వారా ఉత్తర్వులు ఇచ్చి బకాయిలు చెల్లించేలా చూస్తామన్నారు.

సొంత డబ్బులతో వైద్యం



నా భార్య గర్భవతిగా ఉండగా అనారోగ్యానికి గురై హాస్పిటల్‌కు వెళ్లితే ఈఎస్ఐ కార్డు పనిచేయడం లేదన్నారు. ప్రతి నెలా సొంత డబ్బులతో వైద్యం చేయించుకోవలసి వస్తోంది.మాలాంటి చిన్న ఉద్యోగులకు ఆర్థిక భారంగా ఉంది.

పి.నవీన్‌కుమార్, జేఎన్‌టీయూకే పి.నవీన్‌కుమార్.

పీఎఫ్ రావడం లేదు



పీఎఫ్ డ్రా చేసుకుందామంటే అ అదృష్టం లేకుండా పోయింది. ఏదైనా పండగ వేళ ఖర్చుల కోసం ఉన్న డబ్బులు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దాదాపు 200 మంది ఏడాది కాలంగా వైద్య సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. కనీసం ఈఎస్ఐ వైద్యశాలలో మందులు తీసుకునే సౌకర్యం కూడా పొందలేకపోతున్నాం

పి.కుమార్, జేఎన్‌టీయూకే

సినీనటులు పొగాకు ప్రకటనలు చేయొద్దు



పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు అడ్డాల, శ్రీవల్లి

బోట్‌క్లబ్: సినిమా నటులు పొగాకు ఉత్పత్తులను ప్రోత్సహించే ప్రకటనలు చేయవద్దని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నాగమల్లితోట జంక్షన్ వద్ద టేక్ డౌన్ టొబాకో నేషనల్ డే ఆఫ్ ఆక్షన్ సందర్భంగా పొగాకు ఉత్పత్తులు సేవించడం వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సినీ ప్రముఖులు బాధ్యతా రహితంగా ప్రకటనల్లో నటించడం బాధాకరమన్నారు. వీరిని ఆరాధించే కోట్ల మంది యువత వీటిని సేవించి వారి బంగారు భవిష్యత్తులు పాడు చేసుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించి మన దేశ యువతను కాపాడాలన్నారు. దంత వైద్యురాలు శ్రీవల్లీ మాట్లాడుతూ పాన్ మసాలా బ్రాండ్ ప్రకటనల ప్రచారంలో కనిపించినందుకు ఇటీవల అక్షయ్‌కుమార్ తన అభిమానులకు క్షమాపణలు చెప్పారన్నారు. ఆయన బాటలోనే ఇతర నటుడు అమితాబచ్చన్, సల్మాన్‌ఖాన్, మహేష్ బాబు, షారుఖాన్, అజయ్‌దేవగన్, సునీల్ గవాస్కర్ నడవాలన్నారు.

క్లుప్తంగా

సీతారామస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బోట్‌క్లబ్: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామికి ఆలయ అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ కాదని పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలో కూటమి నాయకులు ఏకపక్షంగా పింఛన్లు పంపిణీ చేయడంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తంచేశారు. నవంబరు నెలలో మృతిచెందిన భార్యాభర్తలలో (స్పౌజ్) ఒకరు మరణిస్తే మరొకరికి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటువంటి పింఛన్లు ఈ నెల కొత్తగా 30 మంజూరు కాగా, మరొకటి అనారోగ్యంతో వైద్యం చేయించుకుంటున్న వారికి మంజూరు చేశారు. ప్రొటోకాల్ ప్రకారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కొత్త పింఛన్లు పంపిణీ చేయాలి. మండలంలో 95 శాతం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందినవారే ఉన్నారు. అలాంటిది వారితో కాకుండా కూటమి నేతలే పింఛన్లు పంపిణీ చేయడం విమర్శలకు తావిచ్చింది.

92 శాతం అందజేత

మండల పరిధిలో సోమవారం సాయంత్రానికి 92.05 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పింఛన్‌దారులు 11,274 మంది ఉండగా రూ.4,85,30,000 ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 10,376 మంది లబ్ధిదారులకు రూ.4,44,09,500 గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితర ప్రభుత్వోద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇచ్చారన్నారు.

యండమూరులో కొవ్వొతుల ర్యాలీ



యండమూరులో రాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కరప: క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు, పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని యండమూరు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ ఐ.జాన్ సూర్యప్రకాష్ కోరారు. యండమూరులో సోమవారం రాత్రి గ్రామంలోని క్రైస్తవులతో కలసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

నీటి తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వాడ గ్రామంలో పశువులకు నీటి తొట్టె నిర్మాణానికి ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళవారం శంకుస్థాపన చేశారు. వేసవిలో పశువులకు తాగు నీటి కోసం ఉపాధి హామీ నిధులతో ప్రతి గ్రామంలో నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని సుమారు రూ.33 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వసంతమాధవ్, ఎంపీడీఓ సతీష్, ఈఈ పీఆర్ అండ్‌ఆర్డీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నౌకారంగ అభివృద్ధికి షిప్పింగ్ బిల్లు దోహదం

బోట్‌క్లబ్: దేశీయ నౌకా రంగం అభివృద్ధితో పాటు మారిటైం రంగంలో ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కోస్టల్ షిప్పింగ్ బిల్లు దోహదం చేస్తుందని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అభిప్రాయ పడ్డారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న కోస్టల్ షిప్పింగ్ బిల్లు–2024పై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. దేశంలో 7500 సుదీర్ఘ తీర ప్రాంతాలు ఉన్నప్పటికీ సరుకు రవాణా కేవలం ఏడు శాతం మాత్రమేనన్నారు. ఈ బిల్లు ద్వారా తీర ప్రాంతాల్లో సరుకు రవాణా సులభతరం అవుతుందన్నారు.

కరప పోలీసు స్టేషన్‌కు డ్రోన్



డ్రోన్ కెమెరాతో తీసిన చిత్రాలు

కరప: స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఎస్పీ జి.బిందు మాధవ్ ఒక డ్రోన్ కెమెరా ఇచ్చినట్టు ఎస్‌ఐ టి.సునీత మంగళవారం తెలిపారు. మండల పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకట్ట వేయడానికి ఈ కెమెరా ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఈ డ్రోన్ కెమెరా గ్రామాల్లో పేకాట స్థావరాలు, కోడిపందేల బరులు పసి కట్టేందుకు, జాతర సమయంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా పర్యవేక్షించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కరప పోలీస్‌స్టేషన్ సమీపంలో డ్రోన్ కెమెరాతో తీసిన విజువల్స్ చూపించి, అది పనిచేసే విధానంపై ఎస్‌ఐ సునీత సిబ్బందికి అవగాహన కల్పించారు.

సాగుదారులకు పట్టాలివ్వాలి



పేదల సాగులో ఉన్న భూమికి పట్టాలివ్వాలంటూ ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చెందుర్తి, కొడవలి, వజ్రకూటమి గ్రామాల్లో 40 ఏళ్లుగా జీడిమామిడి తోటలు పెంచి సాగు చేసుకుంటున్న 356 ఎస్సీ, బీసీ కుటుంబాలకు హక్కులు కల్పించి, పట్టాలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద అఖిల భారత వ్యవసాయ–గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వారు ధర్నా చేశారు. చెందుర్తి గ్రామ సర్వే నంబర్ 1లో 456 ఎకరాల ప్రభుత్వ కొండ పోరంబోకు భూమిని సాగు చేస్తున్నవారికి పట్టాలు ఇవ్వాలని స్థానిక అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు, స్థానిక ప్రజాప్రతినిధులకు అనేక పర్యాయాలు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఈ భూమికి సంబంధించి 356 కుటుంబాలకు పట్టాలివ్వకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూముల సాగుదారులకు ప్రభుత్వ అధికారులు అనేకసార్లు పట్టాలిచ్చారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, భూకబ్జాదారులు పట్టాలు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యని ఆందోళనకారులు విమర్శించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, పిఠాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే కొణిదల పవన్‌కళ్యాణ్, ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జేసీ, కాకినాడ డివిజనల్ రెవెన్యూ అధికారికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు గొడుగు సత్యనారాయణ, కాకర రత్నకుమార్, చెందుర్తి కమిటీ కార్యదర్శి పిల్లా చంద్రం, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆకలి కాలానికి చెల్లు

- జీజీహెచ్ భోజనాల షెడ్ ఆధునీకరణ
- ప్రారంభించిన కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి





ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసిన కస్టమ్స్ శాఖకు ధన్యవాదాలు తెలుపుతూ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో ఆధునీకరించిన భోజనాల షెడ్‌ను రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మంగళవారం ప్రారంభించారు. గతేడాది సెప్టెంబర్ 12న సాక్షిలో ప్రచురితమైన 'ఆకలి కాలం' కథనానికి నరసింహారెడ్డి స్పందించారు. విజయవాడ రాష్ట్ర కార్యాలయం నుంచి కాకినాడ కస్టమ్స్ సిబ్బందికి మార్గనిర్దేశం చేసి ఐదు నెలల వ్యవధిలో ఆధునీకరణ పనులు పూర్తిచేసి మంగళవారం షెడ్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా షెడ్ ఆధునీకరణతో పాటు మరుగుదొడ్ల మరమ్మతులకు కస్టమ్స్ శాఖ నుంచి స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రూ.10 లక్షల నిధులు కేటాయించామన్నారు. కాకినాడ కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ జి.రామకృష్ణ రాజు పర్యవేక్షణలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సహకారంతో ఈ పనులు సాగాయన్నారు. అనంతరం నరసింహారెడ్డిని ఆస్పత్రి అధికారులు సత్కరించి ఆస్పత్రి తరపున ధ్రువపత్రాన్ని అందజేశారు. కస్టమ్స్ శాఖ తరపున నరసింహారెడ్డి సామాజిక బాధ్యతను గుర్తిస్తూ మరింత మంది దాతలు ఆసుపత్రి అభివృద్ధికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.రవికుమార్, సూపరింటెండెంట్ రమేష్‌తో పాటు కస్టమ్స్ అధికారులు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, ఆసుపత్రి ఇన్‌చార్జి ఏడీ, ఏవో శర్మ, ఏపీఎన్‌జీవో నేతలు వెంకటకృష్ణ, పాలపర్తి మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 350 నీటి తొట్టెల మంజూరు



వంతెనకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ప్రత్యేకాధికారి వీరపాండ్యన్, ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు జిల్లాకు 350 నీటితొట్టిలు మంజూరయ్యాయని కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. మాధవపట్నంలో సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ అధ్యక్షతన, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యాన మంగళవారం జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆయన, జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్ పాల్గొన్నారు. గ్రామ శివారున జమునా నగర్ కాలనీలో ఉపాధి హామీ నిధులు రూ.70 లక్షలతో నిర్మించే వంతెనకు, ప్రధాన గ్రామంలో రూ.32 లక్షలతో నిర్మించే నీటి తొట్టెలకు, పంచాయతీ నిధులు రూ.34 లక్షలతో నిర్మించే మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 2 వేల పశువుల షెడ్లు నిర్మిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు ప్రత్యేక అధికారి వీరపాండ్యన్ పింఛన్లు అందజేశారు. కార్యక్రమాల్లో కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్మన్ తుమ్మల బాబు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ విత్తనాల వెంకట రమణ, కాకినాడ ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి జె.నరసింహ నాయక్, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఉపాధి హామ ఏపీడీ వసంత మాధవి, ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలో చేపల వేట



వివాదాస్పద చెరువులో చేపలు పట్టుబడిని పర్యవేక్షిస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో వివాదాస్పదమైన పెద్ద చెరువులో మంగళవారం అధికారుల పర్యవేక్షణలో చేపల వేట నిర్వహించారు. ఈ చెరువులో చేపలు పట్టుకునే విషయంలో గ్రామానికి చెందిన శ్రీ శ్రీనివాస ఫిషర్‌మన్ కో ఆపరేటివ్ సొసైటీకి, కొడవలికి చెందిన అంబేద్కర్ జాలరి సంఘానికి మధ్య కొంత కాలంగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల వివాదాన్ని పరిష్కరించడానికి ఫిషరీస్ డీడీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాలతో సమావేశం నిర్వహించారు. వివాదం కోర్టులో ఉన్నందున చెరువు నీరు అడుగంటుతున్నందున చెరువుకు పాలకవర్గం లేకుండా ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో చేపలు పట్టి విక్రయించేలా చర్యలు తీసుకున్నారు. ఏ విధమైన శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండడానికి ప్రత్యేక అధికారి ఆధీనంలో ఫిషరీస్ రెవెన్యూ పంచాయతీ అధికారుల సమక్షంలో చేపలు పట్టి స్థానికులకు కిలో వంద రూపాయలకు, ఇతరులకు మార్కెట్ ధర మేరకు విక్రయించి, తద్వారా వచ్చిన సొమ్మును సొసైటీ అకౌంట్‌లో ఖర్చులు పోగా జమ చేస్తున్నట్లు ఫిషరీస్ డీడీ బి కృష్ణారావు తెలిపారు. కోర్టు ఆదేశాలు అమలు చేస్తామని అప్పటివరకు ఇరు వర్గాలు చెరువులో చేపలు పట్టుబడి వద్దకు రాకూడదని ఆదేశించామన్నారు. కేవలం అధికారుల సమక్షంలో చేపలు పట్టి నిబంధనల ప్రకారం విక్రయించినట్టు ఆయన తెలిపారు. మంగళవారం సుమారు రెండు టన్నుల చేపలు పట్టి విక్రయించామని త ద్వారా వచ్చే సొమ్ము సంఘానికి జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సత్యనారాయణ, ఎస్సై నౌడు రామకృష్ణ, ఆర్‌ఐ బాలకృష్ణ, ఫిషరీష్ ఏడీ కరుణాకరరావు తదితరులున్నారు. పాడా పీడీ చైత్రవర్షిణి చేపల పట్టుబడిని పరిశీలించి ఎటువంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

తాపానికి ఉక్కిరిబిక్కిరి!

- గ్రీష్మ తాపంతో జనం విలవిల
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బ భయంతో ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు
- అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు
- నిర్మానుష్యంగా రహదారులు



నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ-పిఠాపురం రోడ్డు

కొత్తపల్లి: భానుడు బగభగమంటున్నాడు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే తాపం ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుండడంతో ప్రజలు హడలి పోతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి తాపంతో శీతల పానీయాలు, పండ్ల రసాలు, కొబ్బరికాయల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. సముద్ర తీరాలకు సమీపంలోని వారు చల్లగాలి కోసం వ్యాహ్యాళికి అక్కడికి వెళ్లి సేదతీరుతున్నారు. తప్పనిసరి పనులపై బయటకు వచ్చే వాహనచోదకులు ముఖానికి రుమాళ్లు కట్టుకుని ప్రయాణిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులతో వడదెబ్బ, డీహైడ్రేషన్ సాధారణంగా సంభవిస్తాయి. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడం జరుగుతుంది.

వడదెబ్బ సోకకుండా

నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. లేత వర్ణాలు, తేలికైన, కాటన్ దుస్తులు ధరించాలి. రోజూ కనీసం 15 గ్లాసులు నీళ్లు తాగాలి. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. శుభ్రంగా రెండు పూటలా స్నానం చేయాలి.



ఉప్పాడ తీరంలో పర్యాటకులు



వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అమీనాబాద్‌లో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ఎండలు తీవ్రంగా ఉన్నందున గాలిలో తేమ శాతం తగ్గుతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ వల్ల వడదెబ్బకు గురికాకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. పండ్లు, తాజా ఆహారపదార్థాలు తీసుకోవాలి. ఎండ తీవ్రత పెరిగితే చిన్నారులు, వద్ధులు పొలాల్లో పనులు చేసే కూలీలు వడగాల్పులకు గురయ్యే అవకాశం ఉంది. దీన్ని గమనించి వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలు బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలి. ఉపాధి పథకం కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన తడి వస్త్రంతో శరీరాన్ని తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు ఇలా చేస్తూ ఉండాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీళ్లు తాగించకూడదు. వీలైనంత త్వరగా సమీపంలోని పీహెచ్‌సీకి తరలించాలి.

– సుష్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తపల్లి

పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేయండి

సామర్లకోట: వేసవి కాలం పూర్తిగా ప్రారంభం కాకుండానే స్థానిక 31వ వార్డు ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. వార్డులోని ప్రధాన వీధులకు తాగునీటి ప్రధాన పైపులైన్ లేకపోవడం వల్ల ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన పైపులైన్ లేక పోవడం వల్ల ఇంటి కుళాయిలు వేయడానికి అవకాశం లేదని మున్సిపల్ అధికారులు చెప్పన్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ కుళాయి ఇస్తామని ప్రకటించే అధికారులకు ప్రతి వీధికి ప్రధాన పైప్‌లైన్ వేయాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నిస్తున్నారు. తమ వార్డులో కుళాయి ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వారిని బతిమాలి నీరు తెచ్చుకుంటున్నామని వారంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రధాన పైపులైన్ ఏర్పాటు చేయడంతో పబ్లిక్ కుళాయి ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.

ఆప్కాస్ రద్దుకు నిరసనగా ధర్నా

పెద్దాపురం: ఆప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. యూనియన్ నాయకులు సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు దారుణమన్నారు. దీనివల్ల కార్మికులు రోడ్డున పడతారన్నారు. గతంలో ఆప్కాస్ స్థానంలో మున్సిపల్ శానిటేషన్ వర్కర్లను, ఇంజినీరింగ్ వర్కర్లను పర్మినెంట్ చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆప్కాస్ స్థానంలో ప్రైవేట్ ఏజెన్సీలను తీసుకువచ్చే ఆలోచన ఉంటే మున్సిపల్ శానిటేషన్, ఇంజినీరింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివకోటి అప్పారావు, వర్రే గిరిబాబు, సింగంపల్లి సింహాచలం పాల్గొన్నారు.